ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

జయశంకర్ భూపాలపల్లి

ములుగు

5

ఆదివారం 22 సెప్టెంబరు 2024





బొడ్డెమ్మ బొడ్డెమ్మా.. కోల్..

సండే స్పెషల్ SUNDAY SPECIAL

ఉమ్మడి జిల్లాలో బొడ్డెమ్మ వేడుకలకు సిద్ధమైన ఆడబిడ్డలు

- రేపటి నుంచి సాగనున్న సంబురం
- తొమ్మిది రోజుల పాటు సందడే సందడి
- ఆఖరి రోజున నిమజ్జనం
- ప్రాచీన పండుగకు ఆదరణ ఏదీ?
- భావితరాలకు కనుమరుగవుతున్న వైనం

7



......తెలంగాణ పల్లె పండుగ బొడ్డెమ్మ పండుగకు ఆడపడుచులు సిద్ధమయ్యారు. పూర్వకాలం నుంచి ఏటా బతుకమ్మ పండుగ ప్రారంభమయ్యే అమావాస్య రోజు ముందువరకు బొడ్డెమ్మ పండుగను యువతులు, బాలికలు వైభవంగా జరుపుకుంటారు. తొమ్మిది రోజుల పాటు పల్లె సుద్దుల గీతాలు, ప్రాచీన పాటలను చప్పట్లతో పాడుతూ సంబురంగా జరుపుకుంటారు. బతుకమ్మ పండుగ ప్రారంభానికి ఒక రోజు ముందుగా నిమజ్జనం చేస్తారు. ఈ వేడుక నిర్వహించుకోవడం వలన చదువు, జ్ఞానం, ఆరోగ్యం సిద్ధించి మానసికంగా ఎంతో ఆనందంతో ఉంటారని నమ్మకం. వందల ఏళ్ల నుంచి ఆచార సంప్రదాయంగా బొడ్డెమ్మ వేడుకను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

- వరంగల్ కల్చరల్

వైద్య విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలి

-భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ



మెడికల్ కాలేజీని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి కలెక్టరేట్, సెప్టెంబరు 21: వైద్య విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్యకళాశాలను కలెక్టర్ శనివారం సందర్శించారు. అటానమి, మ్యూజియం గ్యాలరీ, హెచ్‌ఆర్, మొదటి, రెండో లెక్చర్స్ గ్యాలరీలను కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ రెండో సంవత్సరం వైద్యవిద్యార్థులకు సింగరేణి అధికారులతో మాట్లాడి హాస్టల్ కోసం 3 బ్లాకులు కేటాయిస్తామని తెలిపారు. రెండో సంవత్సరం బోధన కోసం సెంకడ్ లెక్చరర్ హాల్ నిర్మాణానికి నిధులు కేటాయిస్తామన్నారు. మెడికల్ కాలేజీలో అన్ని సౌకార్యలు కల్పిస్తామన్నారు. నర్సింగ్ కాలేజీ ఏర్పాటు కోసం నిర్మాణంలో ఉన్న ఆయుష్ భవనాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మీ, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పోషణమాసం కార్యక్రమంను దిగ్విజయం చేయాలి

ఈ నెల 1 నుంచి ఈ నెల 30 వరకు నిర్వహిస్తున్న పోషణమాసం కార్యక్రమాన్ని దిగ్విజయంగా అమలు చేయాలని కలెక్టర్ రాహుల్‌శర్మ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో ఐసీడీఎస్, విద్య, డీఆర్డీఓ అధికారులతో సమావేశం నిర్వహించిన కలెక్టర్ పోషణమాసం కార్యక్రమంపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మా ట్లాడుతూ 5 ఏళ్ల లోపు పిల్లలు, బాలింతలు, గర్భిణీ స్త్రీలలో పౌష్టికారలోపం తలెత్తకుండా ఉండేందుకు నాణ్యమైన ఆహారం అందించేందుకే ప్రభుత్వం పోషణ అభియాన్ కార్యక్రమంను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోషణమాసం కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో అన్ని గ్రామాల్లో అమలు చేయాలన్నారు. గ్రామాల్లో ఆశకార్యకర్తలు, అంగన్‌వాడీటీచర్లు గ్రామాల్లో ప్రతి ఇల్లును పరిశీలించి పౌష్టికాహార లోపం ఉన్న పిల్లలను గుర్తించాలన్నారు. సరైన బరువు లేకపోవడం, రక్తహీనత, ఇతర వైద్యపరమైన సమస్య ఎదుర్కొంటున్న పిల్లలు, గర్భిణీలు,బాలింతలకు దగ్గరలోని పిహెచ్‌సిల్లో చికిత్స అందించాలన్నారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నాణ్యమైనదిగా అందించాలన్నారు. పాఠశాలల్లో రక్తహీనత, వైద్యపరమైన సమస్యలను గుర్తించి వైద్యులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మీ, ఐసిడిఎస్ పిడి చిన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వర ఆలయ చైర్మన్ పదవి ఎవరిదో..?

మహదేవపూర్, సెప్టెంబరు 21 : త్రివేణి సంగమ గోదావరికి తీరాన ప్రసిద్ధి గాంచిన శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయ చైర్మన్ పదవి నియామకం అతిత్వరలో ప్రభుత్వం చేపట్టనుంది. ప్రసిద్ధి గాంచిన కాళేశ్వర ముక్తీశ్వరస్వామి వారి ఆలయ చైర్మన్ పదవి ఎవరి వరిస్తుందో నని పలువురు ఆశావహులు ఎదురుచూస్తున్నారు. ఎవరికి తెలిసినట్లుగా వారు పదవి కోసం ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. గత నెల 30 నుంచి ఈ నెల 18 వరకు చైర్మన్ పదవి కోసం దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయాలంలో దరఖాస్తుల స్వీకరణ జరిగిన విషయం తెలిసిందే. కాగా అక్టోబర్ నెల మొదటివారంలో దేవాదాయ శాఖ అధికారులు సంబంధిత దరఖాస్తులను ప్రభుత్వానికి సమర్పించనున్నారు. వచ్చిన దరఖాస్తుల నుంచి 14 మందిని మంత్రి శ్రీధర్‌బాబు డిసైడ్ చేయనున్నట్లు తెలిసింది. దేవస్థానం అర్చకుల నుంచి ఒకరిని ఎక్స్ అఫిషియో సభ్యుడిగా తీసుకోనున్నారు. మంత్రి సూచించిన వ్యక్తికి చైర్మన్ పదవి అందనుంది. మిగతా వారంతా డైరెక్టర్లుగా కొనసాగనున్నారు. కాగా కాళేశ్వరం దేవస్థాన చైర్మన్‌గా కాంగ్రెస్ సీనియర్ నాయకులు కామిడి శ్రీనివాస్‌రెడ్డి పేరు ఖరారైనట్లు ప్రచారం జరుగుతోంది. శ్రీనివాస్ రెడ్డి చైర్మన్ అయితే మొదటిసారి కాళేశ్వరం నుంచి స్థానిక నాయకుడికి పదవి దక్కినట్లవుతుంది.

మెడికల్ కాలేజీకి పూర్తి స్థాయి సిబ్బంది

- 433మంది కాలేజీకి , ఫైర్ స్టేషన్‌కు 35మంది
- మంత్రిమండలిలో ఆమోదం
- ధన్యవాదాలు తెలిపిన సీతక్క

ములుగు, సెప్టెంబరు 21: రాష్ట్ర మంత్రిమండలిలో ములుగు జిల్లా అభివృద్ధికి సానుకూల నిర్ణయాలు తీసుకున్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌లో సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో ములుగు వైద్యకళాశాలకు పూర్తిస్థాయిలో సిబ్బంది నియామకానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. బోధన, బోధనేతర విభాగాలలో 433మంది సిబ్బందిని నియమించేందుకు ఆమోదించింది. అదేవిధంగా గత ప్రభుత్వంలో ఏటూరునాగారానికి మంజూరు చేసిన అగ్నిమాపక కేంద్ర నిర్మాణం, 35మంది సిబ్బంది నియామకం కోసం కూడా కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈవిషయమై రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీశిశు సంక్షేమశాఖల మంత్రి సీతక్క హర్షం వ్యక్తం చేశారు. పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించడం ద్వారా వైద్యకళాశాలలో విస్తృత సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఏజెన్సీ ప్రాంత ప్రజలకు ప్రకృతి విపత్తుల సమయంలో ఫైర్ స్టేషన్ ద్వారా మెరుగైన సేవలు అందుతాయని తెలిపారు. ములుగు జిల్లా అభివృదికి సహకారమందించిన సీఎం, సహచర మంత్రులకు సీతక్క ధన్యవాదాలు తెలిపారు.

రేషన్ కార్డుకు మోక్షం..!

- వచ్చే నెలలో జారీ చేస్తామన్న ప్రభుత్వం
- పదేళ్లుగా నిరీక్షిస్తున్న పేదలు
- కార్డులు లేక అనేక ప్రయోజనాలకు దూరం
- మోక్షం లభిస్తే ఆయూష్మాన్ భారత్ ద్వారా మరింత లబ్ధి
- ఇప్పటికే ప్రజాపాలన ద్వారా దరఖాస్తుల స్వీకరణ





(ఆంధ్రజ్యోతి, భూపాలపల్లి), సెప్టెంబరు 21 : రేషన్‌కార్డు నగటు పేద వాడి చిరకాల కోరిక. సరిగ్గా పదేళ్ల క్రితం నిలిచిన పోయిన కార్డుల జారీ ప్రక్రియ అనేక శశబిషల తరువాత ఎట్టకేలకు మోక్షం లభించబోతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. దాంతో ఎన్నో ఏళ్ల నిరీక్షణకు తెర పడే అవకాశం ఉండడంతో ఆహార భద్రతకు దూరమైన వేలాది మంది కుటుంబాల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. 2014కు ముందు అధికారంలో ఉన్న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కొత్త కార్డులు జారీ చేయగా ఆ తరువాత అధికారంలోకి వచ్చిన భారత రాష్ట్ర సమితి కూడా మొదటి చివరిసారిగా 2015 లోకార్డులను జారీ చేసింది. ఆ తరువాత మార్పులు చేర్పులు, సవరణల పేరుతో కార్డుల జారీని నిలిపివేసి ఉన్న కార్డుల్లోనే కోత పెట్టేందుకు శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలో రెవెన్యూ, పౌరసరఫరాల అధికారులు అర్హులు అనర్హులు అని తేడా లేకుండా వేలాది మంది కార్డులను రద్దు చేసి ఆ కుటుంబాలను రోడ్డున పడేసింది. ఆ తరువాతి క్రమంలో కోవిడ్ మహమ్మారి విజృంభించి రెండేళ్ల దాక జనజీవనాన్ని అస్తవ్యస్తం చేయగా కేంద్ర ప్రభుత్వం కేవలం తెల్ల రేషన్‌కార్డు కలిగిన పేదలకు మాత్రమే ఉచితంగా రేషన్‌ను అందించింది. దాంతో కార్డులను కోల్పోయిన వేలాది మందితో పాటు కొత్తగా ఏర్పడిన కుటుంబాలకు చెందిన వారికి కూడా రేషన్ అందకుండా పోయింది. ఈ నేపథ్యంలో రేషన్‌కార్డులను జారీ చేయాలన్నా డిమాండ్ బలంగా వినిపించినప్పటికీ భారాసా ప్రభుత్వం ఏ కారణం చేతనో ప్రజల డిమాండ్‌ను బుట్ట దాఖలు చేసింది. మధ్యలో ప్రజల ఒత్తిడిని తట్టుకోలేక మీ సేవా కేంద్రాల ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు అనధికారికంగా ప్రకటించినా.. అలాంటి దరఖాస్తులకు నేటి వరకు మోక్షం లభించలేదు. ఇలా కొత్త రేషన్‌కార్డుల కోసం రాష్ట్ర వ్యాప్తంగా కేవలం మీసేవ కేంద్రాల ద్వారా 14వేల దరఖాస్తులు వచ్చినట్లు సమాచారం. ఈ క్రమంలో 2023 డిసెంబర్‌లో ఎన్నికలు జరిగిన తరువాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన పేరుతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు, రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చునని ప్రకటించడంతో రాష్ట్ర వ్యాప్తంగా కుప్పలు, తెప్పలుగా దరఖాస్తులు వచ్చిపడ్డాయి. అయినప్పటికీ గత ఎనిమిది నెలలుగా ఆ దరఖాస్తులపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. అయితే, తాజాగా కొత్త రేషన్‌కార్డులకు లైన్‌క్లియర్ చేయబోతున్నట్లు రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సంకేతాలు ఇచ్చారు. ప్రధానంగా రేషన్‌కార్డులకు అనుసంధానమై ఉన్న అనేక సంక్షేమ పథకాలకు అర్హులైన వేలాది మంది పేదలు లబ్ధి పొందడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తిన దరిమిలా ప్రభుత్వం కొత్త రేషన్‌కార్డులను జారీ చేయాలని నిర్ణయించడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంటుంది. మరీ ముఖ్యంగా ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన రుణ మాఫీ ప్రక్రియలో తెల్ల రేషన్ కార్డును క్రైటీరియాగా తీసుకోవడం ఒకే కుటుంబంలో ఒకరికి రుణమాఫీ వర్తించి కార్డు లేనందున మరొకరికి నిలిచిపోవడంతో రైతాంగంలో తీవ్ర అసంతృప్తి కనిపిస్తుంది. అంతేకాకుండా ఆరోగ్యకార్డులు, ఆయుష్మాన్ భారత్ వంటి పథకాలకు కార్డు లేకపోవడం వల్ల పేదలు దూరమవుతున్నట్లు అధికార వర్గాలు ప్రభుత్వానికి నివేదించడంతో వీలైనంత తొందరగా రేషన్‌కార్డుల జారీ ప్రక్రియను చేపట్టాలనే యోచనకు వచ్చినట్లు తెలుస్తోంది. అంతేకాకుండా త్వరలోనే మంజూరు చేయనున్న ఇందిరమ్మ ఇళ్లకు తెల్లరేషన్ కార్డులను ప్రామాణికంగా తీసుకోనుండడంతో రేషన్‌కార్డుల జారీ ప్రభుత్వానికి కూడా అనివార్యంగా మారిందంటున్నారు. ఈ క్రమంలో అక్టోబరు నెలలో రేషన్‌కార్డుల జారీ ప్రక్రియను ప్రారంభించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తుందని భావిస్తున్నారు.

భూపాలపల్లి జిల్లాలో..

భూపాలపల్లి జిల్లాలోనూ తెల్ల రేషన్‌కార్డులు లేని కుటుంబాల సంఖ్య దాదాపు 15వేలకు పైగానే ఉన్నట్లు అనాధికారిక గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ప్రజాపాలన సందర్భంగా చేసుకున్న దరఖాస్తులకు తోడు అంతకుముందే మీసేవ కేంద్రాల్లో చేసుకున్న దరఖాస్తులను పరిగణలోకి తీసుకుంటే ఈ సంఖ్య 25 వేలకుపైనే ఉంటుందని భావిస్తున్నారు. ప్రస్తుతం భూపాలపల్లి జిల్లాలో మొత్తం 1,23,497 తెల్ల రేషన్‌కార్డులు ఉన్నాయి. ఇందులో భూపాలపల్లి పట్టణానికి సంబంధించి 20,393, చిట్యాల 11,339, గణపురం 11,383,కాటారం 11,397, పలిమెల 2320, మహాముత్తారం 8381, మహదేవపూర్ 10057, మల్హర్‌రావు 8,872, మొగుళ్లపల్లి 11581, టేకుమట్ల 8566, రేగొండ(కొత్తపల్లిగోరి) 19,208, రేషన్‌కార్డులు ఉన్నాయి. కొత్త రేషన్‌కార్డుల జారీ ప్రారంభిస్తే ఈ సంఖ్య మరో 20 వేల నుంచి 30 వేల వరకు పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

కార్డు లేకపోవడంతో ఎదురయ్యే సమస్యలు..

- తెల్ల రేషన్‌కార్డులు లేకపోవడం వల్ల వేలాది మంది అర్హులు సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారు.
- కార్డు లేకపోవడంతో రైతు రుణమాఫీలో సమస్యలు ఎదురవుతున్నాయి.
- విద్యార్థులకు ఉపకార వేతనాలు అందడం లేదు.
- ఆదాయ పరిమతికి సమస్యలు ఎదురవుతున్నాయి.
- రేషన్‌కార్డులు లేకపోవడంతో ఇందిరమ్మ ఇళ్లకు అనర్హులుగా మారే అవకాశం ఉంది.
- ఆరోగ్యశ్రీకార్డు లేకపోవడంతో రూ.10 లక్షల వరకు లబ్ధి చేకూరే బీమాకు దూరమవుతున్నారు.
- సబ్సిడీ బియ్యం రాకపోవడం వల్ల ఆహార భద్రత సమస్యలు ఎదుర్కొంటున్నారు.
- తెల్ల రేషన్‌కార్డు ఉంటేనే పేదలకు ఉచితంగా రేషన్‌కార్డు ఇస్తామనే నిబంధనతో ఇబ్బందులు పడుతున్నారు.
- 200 యూనిట్ల ఉచిత గృహ విద్యుత్‌కు రేషన్ కార్డే ప్రామాణికం.

ఏజెన్సీలో అప్రమత్తమైన పోలీసులు

ముమ్మరంగా వాహనాల తనిఖీలు



ఆవిర్భావ వారోత్సవాల నేపథ్యంలో ఏటూరునాగారం మండల కేంద్రంలో ఐటీడీఏ ఎదుట వాహనలను తనిఖీ చేస్తున్న ఎస్సై

ఏటూరునాగారం, సెప్టెంబరు 21: మావోయిస్టు పార్టీ 20వ ఆవిర్భావ వారోత్సవాలను ఘనంగా విలుపునిచ్చిన నేపథ్యంలో నక్సల్స్ ప్రభావిత ప్రాంతమైన ములుగు జిల్లా పోలీస్ యంత్రాంగం అప్రమత్తమై అడవులను జల్లెడ పడుతున్నారు. మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయం వద్ద, వైజంక్షన్ మూలమలుపు, బూర్గంపాడు- ఏటూరునాగారం జాతీయ రహదారిలో శనివారం వాహన తనిఖీలు చేపట్టారు. ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ ఆదేశాల మేరకు ఏటూరునాగారం సీఐ అనుముల శ్రీనివాస్, ఎస్సై ఎస్.కె. తాజుద్దీన్ ఆధ్వర్యంలో ముమ్మరంగా తనిఖీ చేశారు. వాహనాల ధ్రువీకరణ ప్రతాలు, డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలని వాహనదారులను హెచ్చరిస్తున్నారు. అతేకాకుండా మావోయిస్టులు సంచరించే సావరాలను గుర్తించినందుకు అడవులను జల్లెడ పడుతున్నారు. గొత్తికోయగూడాలల్లో ఈ మేరకు పోలీసులు తనిఖీలను ముమ్మరం చేస్తున్నారు. ఆయా గూడాలల్లో స్పెషల్ పార్టీ, గ్రేహౌండ్స్, సివిల్, సీఆర్పీఎఫ్ పోలీసులు సంచరించి ఇంటింటా సోదాలు చేస్తున్నారు. మావోయిస్టు ఆవిర్భావ వారోత్సవాలతో పాటు, సరిహద్దు ప్రాంతాల్లో వరుసగా ఎన్కౌంటర్లు జరుగుతున్న నేపథ్యంలో మావోయిస్టులు అడవుల్లోని గూడాలల్లో తలదాచుకుంటున్నారనే సమాచారం మేరకు పోలీసులు ప్రత్యేక నిఘా సారించి తనిఖీలు చేస్తున్నారు. గూడాలల్లోకి గుర్తు తెలియని వ్యక్తులు ఎవరైనా వచ్చి సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరుతున్నారు. అంతేకాకుండా ఏటూరునాగారం నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్తున్న వచ్చి పోయే ఆర్టీసీ, ప్రైవేటు వాహనాలను తనిఖీలు చేసి అనుమానితులను అదుపులోని తీసుకొని వారిని విచారించి వదిలేస్తున్నట్లు సమాచారం.


మేడిగడ్డ బ్యారేజీలో ముగిసిన ఏడీసీపీ సర్వే

తిరిగి వెళ్ళిపోయిన సీడబ్ల్యూపీఆర్ఎస్ శాస్త్రవేత్తలు



బ్యారేజీలో ఏడీసీపీ సర్వే నిర్వహిస్తున్న శాస్త్రవేత్తలు

మహదేవపూర్ రూరల్, సెప్టెంబరు 21 : మేడిగడ్డ బ్యారేజీలో వారం రోజుల కింద చేపట్టిన అకాస్టిక్ డాప్లర్ కరెంట్ ప్రొఫైలర్(ఏడీసీపీ)సర్వే శనివారంతో ముగిసింది. పూణేకు చెందిన సీడబ్ల్యూపీఆర్ఎస్(సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్) శాస్త్రవేత్త సంపత్‌కుమార్ నేతృత్వంలోని ఇద్దరు సభ్యుల బృందం ఆధ్వర్యంలో బ్యారేజీ వద్ద నీటి ప్రవాహ తీవ్రతపై అధ్యయనం ప్రారంభించగా రెండు రోజులపాటు కొనసాగింది. మళ్ళీ సీడబ్ల్యూపీఆర్ఎస్ శాస్త్రవేత్తలు నాగరాజు, వినాయక్‌ధాత్రక్ ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా బ్యారేజీ ఎగువ, దిగువ ప్రవాహాల్లో ప్రవాహ వేగాన్ని నమోదు చేసేందుకు అధ్య యనం ప్రారంభించగా శనివారంతో ముగిసింది. ప్రస్తుతం బ్యారేజీ వద్ద వరద ప్రవాహం లక్ష క్యూసెక్కులకు దిగువకు చేరడంతో శాస్త్రవేత్తలు సర్వేను ఆపేసినట్లు అధికారులు తెలిపారు. వారం రోజుల వ్యవధిలో వచ్చిన ప్రవాహాని కంటే రెట్టింపు స్థాయిలో బ్యారేజీకి వరద వస్తే మళ్ళీ ఈ అధ్యయనాన్ని ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. వారి వెంట డీఈ సురేష్, ఇతర ఇంజనీరింగ్ అధికారులున్నారు.



రేపు విద్యుత్ పోల్ ఎక్కే పరీక్ష

హనుమకొండ టౌన్, సెప్టెంబర్ 21: జూనియర్ లైన్‌మె న్ నియామకం కోసం సోమవారం ములుగురోడ్డులోని ఉత్తర విద్యుత్ శిక్షణ సంస్థ (ఎన్‌పీటీఐ) పోల్ ఎక్కే పరీక్ష నిర్వహిస్తున్నట్లు హనుమకొండ ఎస్ఈ కె. వెంకటరమణ తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో ఉదయం 9 గంటల హాజరుకావాలన్నారు. ఎంపిక పూర్తి పారదర్శకంగా ఉంటుందని, ఏలాంటి దళారులను నమ్మి మోసపోవద్దన్నారు.














స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి..

పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్

గాంధీ భవనంలో ఉమ్మడి జిల్లా పార్టీ నేతలతో సమావేశం



హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలతో సమావేశమైన పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్, తదితరులు

హనుమకొండ, సెప్టెంబరు 21, (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ పిలుపు నిచ్చారు. పార్టీలకతీతంగా జరిగే ఈఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు, మద్దతుదారులు ఎక్కువ మంది ఎన్నికయ్యేలా గ్రామీణస్థాయి నుంచి జిల్లా కేంద్రం వరకు నాయకులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని కోరారు. శనివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో స్థానిక సంస్థల ఎన్నికలే ప్రధాన ఎజెండాగా ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ సమావేశం జరిగింది.

ఈ సందర్భంగా పీసీసీ అధ్యక్షుడు ఈ సందర్భంగా మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయంకోసం పార్టీ అనుసరించాల్సిన వ్యూహం, రూపొందించుకోవలసిన కార్యప్రణాళికపై నేతలకు దశదిశా నిర్దేశం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ కోసం పని చేయనివారికి రాజకీయ భవిష్యత్తు ఉండదని పరోక్షంగా హెచ్చరించారు. ఎమ్మెల్యే అయినా, ఎంపీ అయినా ఎవరైనా స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపుకోసం చేసిన కృషి గీటురాయిగా ఉంటుందని, దానిని బట్టే వారికి రాజకీయ భవిష్యత్తు, పార్టీలో సముచిత స్థానం ఉంటుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నో అభివృద్ధి. సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. వీటిని ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లడం ద్వారా గ్రామీణ స్థాయిలో పార్టీ బలోపేతానికి ఇప్పటి నుంచే పార్టీ శ్రేణులు కృషి చేయాలని అన్నారు. ఒక పక్క అభివృద్ధిని కొనసాగిస్తూనే గ్రామీణ స్థాయిలో పార్టీని క్రియాశీలకంగా నిలిపే ప్రక్రియ సమాంతరంగా సాగాలని మహేష్‌గౌడ్ పిలుపునిచ్చారు. పార్టీపై నిర్లక్ష్యంగా వ్యవహరించేవారి పట్ల కఠిన చర్యలు ఉంటాయన్నారు. గత లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ కోసం ఎవరు కష్టపడి పని చేసింది? ఎవరు పని చేయనిది మొత్తం వివరాల చిట్టా పార్టీ అధిష్ఠానం దగ్గర ఉందని పేర్కొన్నారు. స్థానిక సంస్థ ఎన్నికల్లో విజయానికి గ్రామ స్థాయిలో సమర్థత కలిగిన నేతలను ఇప్పటి నుంచే గుర్తించాలని మహేష్‌కుమార్ ఆదేశించారు.

కాగా, ఇప్పుడున్న కమిటీలన్నిటినీ రద్దు చేయడంతో పాటు కొత్త కమిటీలను సమర్థులైనవారితో నియమించాలన్న అభిప్రాయం సమావేశంలో వ్యక్తమైంది. ఈ కమిటీల ఏర్పాటులో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను కూడా భాగస్వామ్యం చేయాలన్న నిర్ణయాన్ని తీసుకున్నట్టు తెలిసింది. లోకల్ బాడీ ఎన్నికలు దగ్గరపడుతున్నందున అభ్యర్థులను నిలబెట్టడానికి ఇప్పటి నుంచే కసరత్తు మొదలు పెట్టాలని ఎమ్మెల్యేలను పార్టీ అధ్యక్షుడు ఆదేశించారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు పార్టీ గుర్తుమీద జరుగుతున్నప్పటికీ సర్పంచ్, వార్డు సభ్యుల పదవులకు ఎన్నికలు మాత్రం పార్టీలతో సంబంధం లేకుండా జరుగనున్నందువల్ల ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గం పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీల్లో పార్టీ నైతిక మద్దతుతో గెలిచే అవకాశం స్థానిక నాయకులను ఎంపిక చేయడంపై దృష్టి సారించాలని సమావేశం సూచించింది. గత ఎన్నికల్లో మెజారిటీ స్థానిక సంస్థలను బీఆర్ఎస్ గెలుచుకున్న నేపథ్యంలో ఈ సారి ఆ పార్టీకి ఏ మాత్రం అవకాశం ఇవ్వకుండా సమగ్రమైన కార్యప్రణాళికను రూపొందించుకొని ప్రతిపక్ష పార్టీలకన్న ఒకింత ముందుండాలని సమావేశం పిలుపు నిచ్చింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఉన్న మొత్తం 1,688 గ్రామ పంచాయతీల్లో దాదాపు అన్నిటినీ కైవసం చేసుకునేలా సమష్టిగా కృషి చేయాలని పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ పిలుపునిచ్చారు. మంత్రి కొండా సురేఖ ఉమ్మడి జిల్లాలో పార్టీ పరిస్థితి, గ్రామీణ స్థాయిలో స్థానిక సంస్థల ఎన్నికలను ఎదుర్కొనేందుకు భవిష్యత్తులో కానున్న సన్నద్ధతను వివరించారు. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకోవడం, ప్రభుత్వ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లడం, వివిధ స్థాయిలో పార్టీ నేతల మధ్య సమన్వయం సాధించడం ద్వారా స్థానిక ఎన్నికల్లో ఘన విజయం సాధించగలమన్న విశ్వాసాన్ని జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వ్యక్తం చేశారు. ఈసమావేశంలో ఏఐసీసీ పక్షాన విశ్వనాథ్, విష్ణునాథ్‌తో పాటు ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, దొంతి మాధవరెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, గండ్ర సత్యనా రాయణ రావు, రాంచంద్ర నాయక్, కేఆర్ నాగరాజు, అశ్వినీరెడ్డి, కడియం శ్రీహరి., ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షు రాలు ఎర్రబెల్లి స్వర్ణ, ఎంపీలు కడియం కావ్య, బలరాం నాయక్, ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు, వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు పాల్గొన్నారు.





రైళ్ల ట్రాఫిక్‌కు ఇక చెక్

ముగిసిన మూడో రైల్వేలైన్ నిర్మాణ పనుల ● వారంలో అందుబాటులోకి.. త్వరలో ట్రయల్ రన్


సొరంగమార్గం ట్రాక్‌వద్ద రిబ్బన్ కట్‌చేస్తున్న సేఫ్టీ ఆఫీసర్ మాధవి

కాజీపేట, సెప్టెంబరు 21: కాజీపేట - హసన్‌పర్తి - వరంగల్ మధ్య మూడో రైల్వే లైన్ నిర్మాణం పూర్తయింది. ఇక నుంచి ఢిల్లీ నుంచి వరంగల్ మీదుగా చెన్నై, ఢిల్లీ నుంచి కాజీపేట మీదుగా సికింద్రాబాద్‌కు వెళ్లే రైళ్ల ట్రాఫిక్‌కు తెర పడనుంది. హసన్‌పర్తి నుంచి వరంగల్, హసన్‌పర్తి నుంచి కాజీపేట వరకు అదనంగా మూడో రైల్వే లైన్ నిర్మాణం పూర్తయ్యింది. 2021లో ప్రారంభమైన ఈ ట్రాక్ నిర్మాణం.. హసన్‌పర్తి నుంచి వరంగల్ వరకు 21 కిలోమీటర్ల, హసన్‌పర్తి నుంచి కాజీపేట వరకు 10 కిలోమీటర్ల మేర ట్రాక్‌నిర్మాణం చేశారు దీంతో బల్లార్ష నుంచి వరంగల్ వైపు, బల్లార్షా నుంచి కాజీపేట మీదుగా సికింద్రాబాద్ వెళ్లే రైళ్లకు ఎలాంటి అంతరాయం లేకుండా రాకపోకలు సాఫీగా జరుగనున్నాయి. గతంలో న్యూఢిల్లీ నుంచి వరంగల్ వైపు రైలు వెళ్లాలంటే అదే లైన్‌లో కాజీపేట వైపు వెళ్లే రెలును ఆపి వరంగల్ వైపు వెళ్లే రైళ్లను పంపించేవారు. కాజీపేట వైపు రైళ్లను పంపించాలంటే వరంగల్ వైపు వెళ్లే రైలును ఆపాల్సిన పరిస్థితి. దీంతో ప్రతీరోజు గూడ్స్ రైళ్లతో కలిపి సుమారు 150 రైళ్ల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలగడమే కాకుండా రైల్వేకు అపారమైన నష్టం జరిగేది. ప్రస్తుతం కాజీపేట వైపు అదనంగా మరో ట్రాక్, వరంగల్ వైపు అదనంగా మరో ట్రాక్ నిర్మించడంతో మొత్తంగా ఈ రూట్‌లలో నాలుగు రైల్వే లైన్‌లు ఏర్పడ్డాయి. కొత్తగా నిర్మించిన ట్రాక్‌లను రైల్వే సేఫ్టీ అధికారి మాధవి పరిశీలన పూర్తయ్యింది. మరో రెండు రోజుల్లో కొత్త ట్రాక్‌లపై ట్రయల్ రన్ చేపట్టనున్నారు. అనంతరం ఈ ట్రాక్‌ల మీదుగా పూర్తిస్థాయి రైళ్లను నడపనున్నారు.

ఇదే రూట్‌లో సొరంగ మార్గం

కాజీపేట - హసన్‌పర్తి రైల్వేస్టేషన్‌ల మధ్య రైల్ అండర్ బ్రిడ్జి (సొరంగ మార్గం) నిర్మాణం ప్రత్యేకం కానుంది. రైళ్ల రాకపోకలకు అంతరాయం కలుగకుండా ఈ సొరంగ మార్గంలో సుమారు 340 మీటర్ల బ్రిడ్జిని నిర్మించారు. ఈ బ్రిడ్జి మీదుగా ఒకేసారి రెండు రైళ్లు, బ్రిడ్జి కింద నుంచి మరో రైలు రాకపోకలు సాగించనున్నాయి. ఈనెల 19 నుంచి మూడురోజుల పాటు ఈ రైలు మార్గాలను రైల్వే సేఫ్టీ కమిషనర్ మాధవి బృందం పర్యవేక్షించింది. మూడో రైల్వే లైన్‌లు, సొరంగమార్గం ట్రాక్ నిర్మాణంపై ఆమె పూర్తి స్థాయి సంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఇలాంటి సొరంగమార్గ నిర్మాణాలు మరిన్ని చేపట్టడానికి రైల్వే అధికారులు చర్యలు తీసుకోనున్నట్లు తెలుస్తోంది. శుక్రవారం సేఫ్టీ కమిషనర్ మాధవి బృందం రిబ్బన్ కట్‌చేసి కొబ్బరికాయలు కొట్టి, బ్రహ్మణుల వేదమంత్రాల నడుమ ప్రత్యేక పూజలు కూడా చేశారు. ప్రయోగాత్మకంగా నిర్మించిన ఈ ట్రాక్‌లు ఎలాంటి ఇబ్బందులు జరుగకుండా ఉండాలని విజయవంతం కావాలని ఆమె కోరుకున్నట్లు తెలిసింది. ఆమె ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఇస్తే వెంటనే ట్రయల్ రన్‌చేసి వారం రోజుల్లో ఈ ట్రాక్ మీదుగా పూర్తిస్థాయి రైళ్లను నడపడానికి రైల్వే అధికారులు అన్ని చర్యలు తీసుకున్నారు.

బొడ్డెమ్మ బొడ్డెమ్మా.. కోల్..

● ఆడబిడ్డల పండుగ బొడ్డెమ్మ వేడుకలకు సిద్ధమైన పల్లెలు ● రేపటి నుంచి సాగనున్న సంబురం ● తొమ్మిది రోజుల పాటు సందడే సందడి


బొడ్డెమ్మ


బొడ్డెమ్మ ఆడుతున్న మహిళలు, చిన్నారులు (ఫైల్)

వరంగల్ కల్చరల్, సెప్టెంబరు 21: తెలంగాణ పల్లెల్లో ప్రాచీన సంస్కృతి సంప్రదాయాలకు పెద్దపీట వేస్తూ యువతులు, చిన్నారులు యేటా జరుపుకొనే బొడ్డెమ్మ పండుగ సోమవారం నుంచి ప్రారంభం కానుంది. కుంటున్నారు. నేటి కంప్యూటర్ కాలంలో కూడా బొడ్డెమ్మను తెలంగాణ ప్రాంతంలో జరుపుకోవడం మన సంస్కృతికి నిదర్శనం. రాష్ట్రం ఏర్పాటైనప్పటి నుంచి అనేక సంస్కృతి సంప్రదాయాలను కొనసాగించగా ప్రాచీన పండుగగా మొదలయ్యే నాలుగు పండుగల్లో మొట్టమొదటి పండుగ బొడ్డెమ్మ. రాష్ట్ర ప్రభుత్వం గుర్తించకపోవడంతో పాటు ప్రోత్సహించకపోవడం వలన భావితరాల వారికి బొడ్డెమ్మ పండుగ తెలియకుండానే కనుమరుగు కానుంది. అయినా నేటికి సంస్కృతి సంప్రదాయబద్ధమైన బొడ్డెమ్మ పండుగను పల్లె, పట్టణ ప్రాంతాలు, నగరాల్లో ఆచరించుకుంటున్నారు. తొమ్మిది రోజుల పాటు కొనసాగే బొడ్డెమ్మ వేడుకలు మరి కొద్ది గంటల్లో ప్రారంభం కానున్నాయి.

బొడ్డెమ్మ ఎలా ఉంటుంది..?

బొడ్డెమ్మ అనే పదాన్ని అమ్మవారి నామాలలో ఒక నామంగా గుర్తించి బొడ్డెమ్మను పుట్టమన్నుతో తయారు చేస్తారు. ప్రజలు కాలుపెట్టని ప్రాంతానికి చెందిన మట్టి పుట్ట కాబట్టి పుట్ట మన్నును తెచ్చి పీటపై శ్రీచక్ర రూపంలో సహస్రాకారంగా గడులతో తయారుచేసి కింది నుంచి వెడల్పు, మీదికి కలశ రూపంలో సన్నగా తయారు చేస్తారు. ఒక ఆకారం తీసుకొచ్చి బొడ్డెమ్మగా రూపు దిద్దుతారు.

పూజా విధానం

ప్రకృతి సిద్ధమైన పుట్టమన్నుతో తయారు చేసిన బొడ్డెమ్మను ఎర్రమన్నుతో అందంగా అలికి చుట్టూరా పిండితో ముగ్గులు వేసి పసుపు బొట్లు, కుంకుమ బొట్లు పెట్టి పూలతో అలంకరిస్తారు. పైన రాగి చెంబును కలశంగా ఏర్పాటు చేసి కింద బొడ్డెమ్మ ముందు మట్టి ప్రమిద దీపాన్ని పెట్టి అగరబతుఉతలు ముట్టించి చిన్నారులు ఆట పాటలతో కీర్తిస్తూ పూజలు నిర్వహిస్తారు.

ఇంటింటి నుంచి బియ్యం

ప్రతీరోజు సాయంత్రం ఇంటి నుంచి చిన్నారులు ఆట పాటలు నిర్వహించుకోవడానికి బొడ్డెమ్మ వద్దకు బియ్యం, అటుకులు, చక్కర, బెల్లం తెస్తారు. తాము తెచ్చిన బియ్యాన్ని కలశంలో పోసి బొడ్డెమ్మ ఆట పాట నిర్వహించుకున్న అనంతరం అటుకులు, చక్కరను అందరికి ప్రసాదంగా పంచుతారు. తొమ్మిది రోజుల పాటు ఆట పాటలు నిర్వహించుకుంటారు.

ఆఖరి రోజు నిమజ్జనం

తొమ్మిదిరోజులపాటు ఆట పాటలతో బొడ్డెమ్మను భక్తి శ్రద్ధలతో అలంకరించి పూజించి తాము తెచ్చిన బియ్యం, బెల్లాన్ని ఆఖరిరోజు చపాతీ(రొట్టె)లు బెల్లంతో కలిపి లడ్డూలు తయారు చేసి అందరికి ప్రసాదంగా ఇస్తారు. ఆట పాటల అనంతరం వెళ్లి రావమ్మా.. బొడ్డెమ్మా అంటూ.. చెరువులు, కుంటలు, బావుల్లో బొడ్డెమ్మను నిమజ్జనం చేస్తారు.

కనుమరుగు కానున్న బొడ్డెమ్మ

ప్రాచీన పండుగల్లో ఒకటిగా ఉన్న పండుగ బొడ్డెమ్మ. తెలంగాణ ఏర్పాటు అనంతరం పండుగను గుర్తించిన ప్రభుత్వం.. సంప్రదాయమైన బొడ్డెమ్మను మాత్రం గుర్తించకపోవడం శోచనీయం. తరతరాల నుంచి పల్లె, పట్టణ ప్రాంతాల్లో, నగరాల్లో నేటికి నిర్వహించుకుంటున్న ఈ పండుగను గుర్తించకపోవడంతో కనుమరుగు కానుంది. భావితరాల వారికి తెలంగాణ సంస్కృతి పండుగలను అందించాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉంది. స్వచ్ఛంద సంస్థలు కూడా అనేక సంప్రదాయ పండుగలను గుర్తించి వేడుకలు నిర్వహించినా బొడ్డెమ్మను కూడా స్వచ్ఛంద సంస్థలు, ధార్మిక సంస్థలు గుర్తించకపోవడం నిరాశకు గురిచేస్తోందని పలువురు మహిళలు పేర్కొంటున్నారు.

ఎగ్ బోర్డు ఏర్పాటుకు కృషి చేస్తా..

● కోళ్ల వ్యాధుల నివారణకు త్వరలో వ్యాక్సిన్
● కేంద్ర సహాయ మంత్రి జార్జ్ కురియన్



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి జార్జి కురియన్

హనుమకొండ చౌరస్తా, సెప్టెంబరు 21: ఆలిండియా ఎగ్‌బోర్డు ఏర్పాటు కోసం కృషి చేస్తానని కేంద్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమల శాఖ సహాయ మంత్రి జార్జ్ కురియన్ అన్నారు. శనివారం హనుమకొండ అశోకా కన్వెన్షన్ హాల్‌లో వరంగల్ జిల్లా పౌల్ట్రీ ఫార్మర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి కేంద్ర సహాయ మంత్రి జార్జ్ కురియన్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కోళ్ల వ్యాధులు నివారణకు వ్యాక్సిన్ తయారు చేయడం చివరి దశకు వచ్చిందని, త్వరలోనే అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం పౌల్ట్రీ పరిశ్రమల నిర్వాహకులకు అండగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తోందన్నారు. ఐఎల్‌టీ, హెచ్‌పీ కారణంగా దేశవ్యాప్తంగా పౌల్ట్రీ ఫామ్స్ మూసివేస్తున్నారని, ఇప్పటికే కేరళ రాష్ట్రంలో సుమారు 14 పరిశ్రమలు మూసివేశారని గుర్తు చేశారు. కేంద్రం ప్రభుత్వం 109 రకాల గడ్డిని పెంచుకోవడానికి అనుమతి ఇచ్చే విధంగా కృషి చేస్తానన్నారు.

వరంగల్ జిల్లా పౌల్ట్రీ ఫార్మర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు మాట్లాడుతూ.. కరోనా కారణంగా పౌల్ట్రీ పరిశ్రమలు నష్టాల్లో కూరుకుపోయాయన్నారు. దేశంలో ఇప్పటికే చాలా వరకు పౌల్ట్రీ ఫామ్‌లు మూసివేస్తున్నారన్నారు. దేశంలోనే తెలంగాణ రాష్ట్రం గుడ్ల విక్రయాల్లో మొదటిస్థానంలో ఉండగా, రాజస్థాన్ చివరి వరుసలో ఉందన్నారు. అనంతరం పౌల్ట్రీ ఫార్మర్స్ పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని కేంద్ర సహాయ మంత్రికి అందజేశారు. ఈ సమావేశంలో నేషనల్ ఎగ్ కో ఆర్డినేషన్ కమిటీ జోనల్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, వరంగల్ జిల్లా పౌల్ట్రీ ఫార్మర్స్ అసోసియేసన్ ప్రధాన కార్యదర్శి సీహెచ్. ప్రభాకర్‌రెడ్డి, కోశాధికారి ఎం.రాంప్రసాద్, ఉపాధ్యక్షుడు జి.రమణారెడ్డి, సీహెచ్. రవీందర్, శ్రీరాంనాయక్, ఎం.సుబ్బారావు, టి.శ్యాంసుందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.


ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న డైరెక్టర్ శ్రీనివాస్, హీరో చంద్రహాస్

'రాంనగర్ బన్నీ' సినిమాను ఆదరించండి..

మీడియా సమావేశంలో సినిమా దర్శకుడు శ్రీనివాస్ విజ్ఞప్తి

వడ్డెపల్లి, సెప్టెంబరు 21: బుల్లితెర నటుడు ప్రభాకర్ తనయుడు చంద్రహాస్ హీరోగా పరిచయం అవుతున్న రాంనగర్ బన్నీ చిత్రాన్ని సమాజంలోని ప్రతీ ఒక్కరు ఆదరించాలని సినీ డైరెక్టర్ శ్రీనివాస్ కోరారు. శనివారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయనతో పాటు హీరో చంద్రహాస్ మాట్లాడారు. ఈ సినిమా ప్రతీ ఒక్కరు చూసి ఎంజాయ్ చేసేలా ఉంటుందని అన్నారు. కామెడీ, సాంగ్స్, ఫైట్స్ అందరికీ నచ్చే విధంగా ఉంటాయని స్పష్టం చేశారు. ఈ సినిమా వసూళ్లలో 10శాతం వరద బాధితుల సహాయార్థం రెండు తెలుగు రాష్ట్రాల సీఎం రిలీఫ్ ఫండ్స్‌కు ఇవ్వాలని నిర్ణయించినట్లు చెప్పారు. తెలుగు ప్రజలు అందరు ఆదరిస్తే ఈ సినిమా విజయవంతం అవుతుందని కోరారు. ఈ సినిమా అక్టోబరు 4న విడుదలవుతుందని తెలిపారు. ఈ సమావేశంలో బుల్లితెర నటుడు ప్రభాకర్, హీరోయిన్లు విస్మయశ్రీ, రిచాజోషి తదితరులు పాల్గొన్నారు.

నేడు పొలిటికల్ సైన్స్ అలూమ్నీ మీట్



ఏర్పాట్లు పరిశీలిస్తున్న దృశ్యం

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 21: కాకతీయ యూనివర్సిటీ పొలిటికల్ సైన్స్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం 'ది గ్రేట్ రీ యూనియన్' పేరుతో ఆదివారం నిర్వహిస్తున్నట్లు కేయూ పొలిటికల్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ సంకినేని వెంకట్, సీనియర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం శనివారం తెలిపారు ఈ సందర్భంగా విభాగాధిపతి డాక్టర్ సంకినేని వెంకట్ మాట్లాడుతూ.. సెప్టెంబరు 22న ఆదివారం ఉదయం 10.30 గంటలకు కేయూ క్యాంపస్‌లోని పొలిటికల్‌సైన్స్ విభాగంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరుగుతోందని చెప్పారు. రాష్ట్ర గ్రంథాలయం సంస్థ చైర్మన్, పొలిటికల్ సైన్స్ విభాగం పూర్వ విద్యార్థి డాక్టర్ మహ్మద్ రియాజ్, పొలిటికల్‌సైన్స్ విభాగం రిటైర్డు ప్రొఫెసర్లు రఘురాంరెడ్డి, సమ్మయ్యాలాల్, సంజీవరెడ్డి, వీరన్న, హరిప్రసాద్, దినేశ్‌కుమార్‌లతో పాటు పొలిటికల్‌సైన్స్ విభాగం బీవోఎస్ చైర్మన్ డాక్టర్ కృష్ణయ్య, అధ్యాపకులు డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ వడ్డెపల్లి నాగరాజు, డాక్టర్ లక్ష్మీనారాయణ, డాక్టర్ విజయ్‌కుమార్ తదితరులు హాజరుకానున్నారు. పూర్వ విద్యార్థులందరూ హాజరుకావాలని కోరారు.

క్యాంపస్‌లో ప్రత్యేక ఏర్పాట్లు

కేయూ క్యాంపస్‌లోని రాజనీతిశాస్త్రవిభాగంలో ఆదివారం జరిగే పూర్వ విద్యార్థుల సమ్మేళనం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కేయూ క్యాంపస్‌లోని హ్యూమనిటీస్ బిల్డింగ్‌ను సర్వాంగసుందరంగా అలంకిరించారు ప్రత్యేక ఆహ్వాన ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేశారు. అధ్యాపకులు, విద్యార్థులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా అనేక జిల్లాల్లో పొలిటికల్ సైన్స్ పూర్వ విద్యార్థులు హాజరుకానున్నారు. ప్రధానంగా ఉమ్మడి వరంగల్, ఖమ్మం, కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాల నుంచి పెద్దఎత్తున పూర్వ విద్యార్థులు పాల్గొంటారు.

రైలు ప్రమాదంలో యువకుడికి గాయాలు


గాయపడిన శశిధర్

హసన్‌పర్తి, సెప్టెంబరు 21: రైలు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలైన ఘటన ఎల్లాపూర్ రైల్వేస్టేషన్‌లో శనివారం చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల కథనం ప్రకా రం.. కుమ్రంభీం జిల్లా బెజ్జూరు మండల కేంద్రానికి చెంది న కొల్లంపాక శశిధర్ శనివారం ఉదయం ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్‌లో హసన్‌పర్తికి వస్తున్నాడు. ఈ క్రమంలో హస న్‌పర్తి మండల ఎల్లాపూర్ రైల్వే స్టేషన్‌లో నెమ్మదిగా వెళ తున్న ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ రైలు దిగుతుండగా కిందపడ గా తలకు బలమైన గాయాలయ్యాయి. దీంతో రక్తస్రావం కావడంతో స్థానికులు 108కు సమాచారం అందించారు. వెంటనే 108 సిబ్బంది బాధితుడిని ప్రథమ చికిత్స అందించి ఎంజీఎంకు తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించినట్లు బాధితుడి బంధువు హసన్‌పర్తికి చెందిన కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ తెలిపారు. ప్రస్తుతం అతడి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.

కేయూ డిగ్రీ 1, 3, 5 సెమిస్టర్ ఫీజు గడువు 26

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 21: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ కళాశాలల్లో చదువుతున్న బీఏ, బీకాం, బీఎస్సీతోపాటు ఇతర కోర్సుల 1, 3, 5 సెమిస్టర్‌ల పరీక్షల ఫీజులను సెప్టెంబరు 26 వరకు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా చెల్లించుకోవాలని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ తిరుమలదేవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.50 అపరాధ రుసుంతో అక్టోబరు 5వ తేదీ వరకు ఫీజులు చెల్లించుకోవాలని కోరారు. ఇతర వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్‌లో చూడాలన్నారు.

గొర్రెల కాపరి మృతదేహం లభ్యం

ఐనవోలు, సెప్టెంబరు 21: గొర్రెల కాపరి మృతదేహం లభ్యమైన సంఘటన కక్కిరాలపల్లి గ్రామంలో వెలుగుచూసింది. కుటుంబసభ్యులు, పోలీసుల కథనం ప్రకారం కక్కిరాలపల్లికి చెందిన పిట్టల రాజు (26) అనే యువకుడు గొర్రెల కాపరిగా పనిచేస్తున్నాడు. మూడు రోజుల కిందట గొర్రెలను తోలుకపోయిన రాజు.. సాయంత్రం ఇంటికి రాలేదు. తల్లిదండ్రులు గాలించిన అచూకీ లభించ లేదు. గ్రామంలోని ఒక పాత ఇంటి నుంచి దుర్వాసన వస్తుందని భావించి ఇరుగు పొరుగు వారు వెళ్లి చూశారు. రాజు అప్పటికే మృతిచెంది ఉన్నాడు. పోలీసులకు సమాచారం ఇవ్వగా కుళ్లిపోయిన మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. మృతుడికి మద్యం తాగే అలవాటు ఉందని మద్యం సేవించాక తాగడానికి నీళ్లు లభించక మృతిచెందినట్లు భావిస్తున్నారు. తన కుమారుడి మృతిపై ఎలాంటి అనుమానం లేదని తండ్రి స్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నివేదిక వచ్చాక మృతికిగల కారణాలు తెలుస్తాయని ఎస్సై తెలిపారు. కాగా, మృతుడు అవివాహితుడు.

బడి మానేసిన పిల్లలు లేకుండా చూడాలి

- రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ మెంబర్ శోభారాణి

కృష్ణకాలనీ (భూపాలపల్లి), సెప్టెంబరు 21: జిల్లాలో బడిమానేసిన పిల్లలు లేకుండా చర్యలు చేపట్టాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ మెంబర్ శోభారాణి అన్నారు. శనివారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని సంక్షేమాధికారి కార్యాలయంలో జిల్లా సంక్షేమాధి కారి చెన్నయ్య, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు దామోదర్‌తో కలిసి ఐసీడీఎస్, డీసీపీయూ, చైల్డ్ హెల్ప్‌లైన్, సఖి, డీహెచ్‌ఈడబ్ల్యు, పోషన్ అభియాన్ విభా గాలతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా వెనుకబడిన ప్రాంతంతో కూడుకొని ఉన్నందున బాల్య వివాహాలు, బడి మానేసిన బాలలు, లైంగిక వేధింపులకు గుయ్యే బాలలు ఎక్కువగా ఉండే అవకాశాలు ఉన్నా యన్నారు. అక్రమ దత్తతలపై ఉక్కుపాదం మోపి కేసులు నమోదు చేయాలన్నారు. ఈ సమావేశంలో భూపాలపల్లి మహదేవపూర్ సీడీపీవోలు అవంతి, రాధిక, డీసీపీఓ వెంకటస్వామి, సఖి అడ్మిని స్ట్రేటర్ గాయత్రి, జిల్లా మిషన్ కోఆర్డీనేటర్ అనూష పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ మెంబర్ శోభారాణి

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య



కరుణాకర్‌రెడ్డి(ఫైల్)

వేములవాడ/రేగొండ, సెప్టెంబరు 21: రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలోని ఓ ప్రైవేట్ అద్దె గదిలో పొన్నాల కరుణాకర్ రెడ్డి (38) అనే వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండల కేంద్రానికి చెందిన పొన్నాల కరుణాకర్‌రెడ్డి గత మంగళవారం ఇంటి నుంచి బయటకు వచ్చాడు. శనివారం వేములవాడ ఓ ప్రైవేటు అద్దె గదిలో పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో కనిపించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే అతడిని చికిత్స కోసం సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. పౌల్ట్రీ వ్యాపారం చేసే కరుణాకర్ రెడ్డికి కరోనాకాలం నుంచి తీవ్ర నష్టాలు రావడంతో మూడు కోట్ల వరకు అప్పులైనట్టు బంధువుల ద్వారా తెలిసింది. మృతుడు కరుణాకర్ రెడ్డి ఏప్రిల్‌లోనూ ఇంటి నుంచి వెళ్లిపోయి నెలరోజుల తర్వాత ఇంటికి చేరుకున్నాడు. మళ్లీ అప్పుల బాధలు తీవ్రమవడంతో మంగళవారం ఇంటి నుంచి వెళ్లిపోయాడని బంధువులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారని, బంధువులు ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రమేష్ తెలిపారు.

రూ. 3 లక్షల విలువైన కలప పట్టివేత

ఏటూరునాగారం, సెప్టెంబరు 21: ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలోని ఓడగూడెం ప్రాంతంలోని నాగులమ్మ గుడి వద్ద అక్రమంగా నిలువ ఉంచిన టేకు దుంగలను శనివారం అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అటవీశాఖ నార్త్, సౌత్ రేంజర్ మహమ్మద్ రహిమాన్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గత కొన్ని రోజులుగా స్మగ్లర్లు విలువైన కలపను నాగులమ్మ గుడి ప్రాంతంలో దాచి ఉంచి అక్రమార్గంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నట్లు తమకు సమాచారం అందిందన్నారు. ఈ మేరకు తమ సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకొని దాచి ఉంచిన 12 టేకు దుంగలను స్వాధీనం చేసుకొని అటవీశాఖ కార్యాలయానికి తరలించినట్లు రేంజర్ తెలిపారు. కాగా, వీటి విలువ రూ. 3 లక్షలు ఉంటుందని ఆయన పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు.

వాజేడులో ఈదుర గాలుల బీభత్సం

వాజేడు, సెప్టెంబరు 21: మండలంలో శనివారం సాయంత్రం ఈదురు గాలులు భీభత్సం సృష్టించాయి. ఒక్కసారిగా మారిన వాతావరణంతో ఆకాశంలో కారు మబ్బులు కమ్ముకొని ఈదురు గాలులు భారీగా వీచాయి. దీంతో మండలంలో అక్కడక్కడ భారీ వృక్షాలు నేలకొరిగాయి. మండలంలోని గుమ్మడిదొడ్డిలో కరెంటు తీగలపై తాటి చెట్టు పడటంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మండల వ్యాప్తంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడటంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కరెంటు తీగలపై పడిన చెట్లను విద్యుత్ శాఖ తొలగించే పనిలో నిమగ్నం అయ్యారు.

ఇసుక తరలింపునకు నిర్ణీత సమయాలు

మహదేవపూర్ రూరల్, సెప్టెంబరు 21 : పలిమెల, మహదేవపూర్ మండలాల్లోని పంకెన, పెద్దంపేట ఇసుక క్వారీల నుండి ఇసుక లారీలను నియంత్రించాలని అంబట్‌పల్లి గ్రామస్తులు చేపట్టిన ఆందోళనకు క్వారీ నిర్వాహకులు దిగివచ్చారు. అంబట్‌పల్లి కూడలిలో శుక్రవారం ఉదయం 11గంటల నుంచి లారీలను అడ్డుకుని ఆందోళన ప్రారంభించగా రాత్రి 10గంటల వరకు ఎవరూ స్పందించలేదు. ఈమేరకు గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో క్వారీ నిర్వాహకులు ఇసుక తరలించే లారీల నియంత్రణకు ముందుకువచ్చారు. ప్రతి రోజు ఉదయం 11గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు ఖాళీలారీలు పెద్దంపేట వైపు, మధ్యాహ్నం 1.30గంటల నుంచి 3గంటల వరకు లోడు లారీలు మహదేవపూర్ వైపు గ్రామం మీదుగా వెళ్ళేలా నిబంధనలు విధించారు. రాత్రి 10గంటల నుండి ఉదయం 4గంటల వరకు లారీలు రాకపోకలకు అనుమతించినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈమేరకు క్వారీ నిర్వాహకులు గ్రామస్తులకు ఒప్పంద పత్రం రాసిచ్చినట్లు తెలిసింది. నిబంధనలు అతిక్రమిస్తే ఒక్క లారీని కూడ గ్రామం నుండి వెళ్ళకుండ అడ్డుకుంటామని గ్రామస్తులు ఈసందర్భంగా తెలిపారు.

ఉద్యోగుల డిమాండ్లను అమలు చేయాలి

కన్నాయిగూడెం, సెప్టెంబరు 21: తెలంగాణ విద్యాశాఖ డైరెక్టరేట్ నుంచి శుక్రవారం విడుదలయిన వర్క్ అడ్జెస్ట్‌మెంట్ ప్రొసిడింగ్ పై పునః సమీక్షించాలని పీఆర్‌టీయూ ములుగు జిల్లా అధ్యక్షుడు కొయ్యడ సురేందర్ , జిల్లా ప్రధాన కార్యదర్శి రౌతు రాజు ప్రభుత్వాన్ని కోరారు. శనివారం మండల కేంద్రం వారు మాట్లాడారు. ప్రాథమిక పాఠశాలల్లో ఇలాంటి అసంబద్ధమైన నిర్ణయాల వలన విద్యా కుంటుపడుతుందని, ఇప్పటికే ఒక ఉపాధ్యాయుడు జిల్లా నుంచి , మండలం నుంచి వస్తున్న సమాచార క్రోడీకరణ ఆన్‌లైన్ వర్క్‌లో బీజీగా ఉంటున్నారని తెలిపారు.ఉద్యోగుల డిమాండ్లను ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు.

మీ సేవ కేంద్రాలను సందర్శించిన డీఎం

మంగపేట, సెప్టెంబరు, 21: మండలంలోని పలు గ్రామాల్లో గల మీసేవ కేంద్రాలను మీసేవ డీఎం విజయ్ శనివారం సాయంత్రం వరకు సందర్శించారు. మీసేవ కేంద్ర నిర్వాహకుల, సందేహలను, సాంకేతిక సమస్యలను నివృత్తి చేశారు. గత 10 రోజులుగా హైదరాబాద్ మీ-సేవ స్టేట్‌డేటా సెంటర్(ఎస్‌డిసి)లో కొన్ని సాంకేతిక సమస్యల కారణంగా మీ సేవ సర్వీస్‌ల విషయంలో ప్రజలకు కొంత వరకు జాప్యం జరుగు తోందన్నారు. దానికి అనుగుణంగా జూలై 10 తేదీ నుంచి సెప్టెంబరు 12 వరకు అప్లికేషన్లు చేసుకున్న దరఖాస్తులు ఎవైతే అప్రూవ్ లేదా రిజెక్టు కాకుండా ఇంకా పెండింగ్‌లో ఉన్నాయో ఆ దరఖాస్తులను సంబదీత తహసీల్దార్ , ఎసార్వో, ఎమ్మీ అధికారుల లాగిన్ నుంచి తిరిగి మీసేవ మీఎల్ఈ లా గిన్‌కి పంపించ బడ్డాయని, ఆ దరఖాస్తులు మీసేవ కేంద్రంలో తిరిగి డాక్యుమెంట్స్ సమర్పించాల్సి ఉంటుందన్నారు. దరఖాస్తు దారుడికి మీసేవ లో మళ్లి డాక్యుమెంట్స్ సమర్పించాల్సిందిగా ఈఎస్‌డీ ఆఫీస్ నుంచి మేసేజ్ రూపంలో తెలియజేయడం జరిగిం దన్నారు. విషయాన్ని ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్లు విజయ్ రాకేష్‌లు వీడియో కాన్ఫెరెన్స్ ద్వారా మీసేవ కేంద్రాల నిర్వాహకులకు తెలియజేయడం జరుగుతుందని తెలిపారు. తిరిగి డాక్యుమెంట్స్ మీసేవ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయు విధానాన్ని వివరించారు.

అత్యాచారానికి పాల్పడిన నిందితున్ని శిక్షించాలి

ఏటూరునాగారం, సెప్టెంబరు 21: అసిఫాబాద్ జిల్లా జైనూరు మండలంలో ఆదివాసీ మహిళపై అత్యాచారయత్నం చేసిన నిందితుడు ముగ్ధంను అదే రీతిన శిక్షించాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి(తుడుందెబ్బ) తుడుందెబ్బ ఆదివాసీ మహిళ సంఘం, ఆదివాసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై బైటాయించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిందితులను ముస్లిం షేక్ ముగ్ధంను ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా వెంటనే విచారణ జరిపి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర గవర్నర్ చొరవ తీసుకొని నిందితుడిని అరెస్టు చేయాలన్నారు. కాగా, తుడుందెబ్బ నాయకులు జాతీయ రహదారిపై బైటాయించడంతో సుమారు గంట పాటు వచ్చిపోయే వాహనాలు నిలిచిపోయాయి. ఈ విషయం తెలుసుకున్న ఎస్సై తాజుద్దీన్ సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకొని నిందితుడిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన కార్యక్రమాన్ని విరమించారు.

కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

కాటారం, సెప్టెంబరు 21:మండలంలోని పలు గ్రామాలకుచెందిన 25మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్, ఏడుగురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను శనివారం రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రభుత్వ వ్యక్తిగత సహాయకుడు ఆకుల చంద్రశేఖర్ అందజేశారు. మంత్రి శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు పీఏ చంద్రశేఖర్ మండలంలోని పలు గ్రామాల్లోని లబ్ధిదారుల ఇళ్లకు నేరుగా వెళ్లి చెక్కులను పంపిణీ చేశారు. కొందరు అందుబాటులో లేకపోవడంతో మండలప్రజా పరిషత్ కార్యాలయం వద్ద అందజేశారు. పలువురు తమ బిడ్డలకు పెళ్లి చేసి సాయం కోసం ప్రభుత్వానికి దరఖాస్తు చేయగా 25మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు మంజూరవగా , అనారోగ్యాలతో ఆసుపత్రుల్లో చికిత్స పొందిన పలువురు రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ద్వారా సీఎంఆర్ఎఫ్ కోసం దరఖాస్తు చేసుకోగా 7 చెక్కులు మంజూరైనట్లు పీఏ చంద్రశేఖర్ తెలిపారు. మంత్రి శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు లబ్ధిదారుల ను కలిసి చెక్కులు అందించినట్లు వెల్లడించారు.

పీఆర్‌టీయూ టీఎస్ మండల కార్యవర్గం ఎన్నిక

మంగపేట, సెప్టెంబరు, 21: పిఆర్టీయూ టిఎస్ మంగపేట మండలశాఖ సర్వసభ్య సమావేశం మండలశాఖ అధ్యక్షుడు చందా భద్రయ్య అధ్యక్షతన శనివారం సాయంత్రం మంగపేట జడ్పిహెచ్ఎస్ పాఠశాలలో జరిగింది. ఈ సమావేశానికి సంఘం ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల శాఖ అధ్యక్షుడిగా చందా భద్రయ్య మూడోసారి ఎన్నికైనారు. మండల ప్రధానకార్యదర్శిగా మద్దెల నాగేశ్వర్‌రావు, అసోసియేట్ అధ్యక్షుడిగా చేరాల రాజేశ్వర్‌రావు, ఉపాధ్యక్షుడిగా ఎస్. క్రాంతి, మహిళా ఉపాధ్యక్షురాలిగా మాధురి దేవి, కార్యదర్శిగా పాయం వీర నారాయణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకుడిగా లయిం రంజిత్‌కుమార్ వ్యవరించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా సంఘం ములుగు జిల్లా గౌరవ అధ్యక్షుడు దేవులపెల్లి సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు కాసర్ల రమేష్‌లు హజరై మాట్లాడారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు విలువలతో కూడిన గుణాత్మక విద్యను అందించి, ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం పీఆర్టీయూ టిస్ సంఘంతోనే సాధ్యమన్నారు. 310 జీవోల వల్ల దూర ప్రాంతాలకు బదిలీలైన ఉపాధ్యాయులకు వారి స్థానిక జిల్లాకు బదిలీ చేయాలని, దసరా పండుగ నాటికి రెండు డీ.ఏలు సాధిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి వేం యాకూబ్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి. కేశవరావు, ఈసం అనసూర్య, గోవిందరావుపేట మండల అధ్యక్షుడు కణతాల నాగేశ్వర్‌రావు, వాజేడు మండల ప్రధానకార్యదర్శి ఆక దామోదర్‌లతో పాటు సీనీయర్ నాయకులు చింతా లక్ష్మీనారాయణ, పి. మేనక, బాలాజీ, పెనక సత్యనారాయణ, శ్రీనివాస్, సారయ్య, సాధాకర్‌రావు, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

లాభాల వాటా ఏఐటీయూసీ కృషి ఫలితమే

కాకతీయఖని, సెప్టెంబరు 21: ప్రపంచంలో ఎక్కడ లేని విధంగా ప్రభుత్వం గుర్తింపు పొందిన పరిశ్రమ నుంచి లాభాల వాటా ఇప్పించిన ఘనత సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీదని ఆ సంఘం భూపాలపల్లి బ్రాంచి నాయకుడు సుధాకర్‌రెడ్డి, రామ్‌చందర్‌లు శనివారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. సింగరేణి కార్మికులకు లాభాల వాటా ఇప్పించేందుకు తమ నాయకులు ఎంతగానో కృషి చేశారని పేర్కొన్నారు. ప్రధానంగా లాభాల వాటా సృష్టికర్త కేఎల్ మహేంద్ర అని తెలిపారు. 2023-24 లో సింగరేణి సంస్థ గడించిన లాభాల్లో 33 శాతం వాటా ఇప్పించడంలో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ కృషి చేసిందని పేర్కొన్నారు. ఎన్నడూ లేనివిధంగా వరద సహాయాన్ని కార్మికుల వేతనాలనుంచి కాకుండా సంస్థ అభివృద్ధి ఫండ్ నుంచి చెల్లించేలా మట్లాడిన సంఘం ఏఐటీయూసీ అని పేర్కొన్నారు.

భవిష్యత్‌లో మరిన్ని లాభాలు తీసుకురావాలి

కాకతీయఖని : సింగరేణి కార్మికులు భవిష్యత్‌లో సంస్థకు మరిన్ని లాభాలు తీసుకురావాలని ఐఎన్‌టీయూసీ భూపాలపల్లి బ్రాంచి ఉపాధ్యక్షుడు జోగ బుచ్చయ్య శనివారం ఒక ప్రకటనలో కోరారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఆర్జించిన లాభాలలో 33 శాతం వాటాను కార్మికులకు ఇప్పించింది. ఐఎన్‌టీయూసీ కార్మిక సంఘమేనని తెలిపారు. తమ నాయకుడు జనక్ ప్రసాద్ సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో మాట్లాడి ఇప్పించాలని పేర్కొన్నారు. కార్మికుల హక్కుల సాధనకు తమ సంఘం అహర్నిషలు పనిచేస్తుందని తెలిపారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

మల్హర్, సెప్టెంబరు 21 : విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎంపీడీవో శ్యామ్‌సుందర్ అన్నారు. శనివారం మండల కేంద్రమైన తాడిచర్లలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన క్విజ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందించారు. కళాశాల ప్రిన్సిపాల్ విజయదేవి, పంచాయతీ కార్యదర్శి రాజు, అధ్యాపకులు రవీందర్, నరేందర్, ప్రవీణ్, వెంకటరెడ్డి, కరుణాకర్ పాల్గొన్నారు.

లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

మల్హర్, సెప్టెంబరు 21 : మండలానికి 20 కళ్యాణలక్ష్మీ చెక్కులు రాగ ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు చెక్కులను మంత్రి వ్యక్తిగత సహయకులు చంద్రశేఖర్ లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి నేరుగా అందించారు. మండలంలోని మల్లారం, తాడిచర్ల, ఇప్పలపల్లి, కుంభంపల్లి, చిన్నతూండ్ల, పెద్దతూండ్ల, కొండంపేట, వల్లెంకుంట, రుద్రారంలకు చెందిన లబ్ధిదారులకు చెక్కులు మంజూరు కాగ పంపిణి చేశారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

తాడ్వాయి, సెప్టెంబరు 21: మండలంలోని బందాల గ్రామపంచాయతీ పరిధిలోని అల్లిగూడెం గ్రామానికి చెందిన గుమ్మడి పాపయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా కాంగ్రెస్‌పార్టీ మండల నాయకులు శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క ఆదేశాల మేరకు బాధిత కుటుంబానికి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్, మేడారం జాతర ట్రస్టుబోర్డు చైర్మన్ అర్రెం లచ్చుపటేల్, నాయకులు యానాల ఆదిరెడ్డి, మంకిడి ప్రశాంత్, గుమ్మడి మల్లేష్, తోలెం రామారావు, ముత్తయ్య, పాయం నర్సింగరావు, చేల నాగేశ్వర్‌రావు, ఆగబోయిన రామయ్య పాల్గొన్నారు.

● మేడారం : తాడ్వాయి మండలం రెడ్డిగూడెం గ్రామనికి చెందిన అనంతుల సంపత్(50) గత కొన్ని రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ క్రమంలో దశదిన కర్మకు హాజరైన బీఆర్ఎస్ నాయకులు మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. అదేవిధంగా ములుగు జిల్లా మాజీ జెడ్పీ ఛైర్‌పర్సన్ బడే నాగజ్యోతి ఆదేశాల మేరకు మేడారం మాజీ సర్పంచ్ చిడం బాబురావు బిఆర్ఎస్ నాయకులతో కలిసి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు గజ్జల సమ్మయ్య, గుర్రాల రాజిరెడ్డి, బెండల నర్సయ్య, కడారి శ్రీను, వీరచారి పాల్గొన్నారు.

పల్టీ కొట్టిన ద్విచక్ర వాహనం

వాజేడు, సెప్టెంబరు 2: అదుపు తప్పి ద్విచక్ర వాహనం పల్టీ కొట్టిన సంఘటనలో ఒకరికి తీవ్ర గాయాలు కాగా మరోకరికి స్వల్ప గాయాలు అయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఏటూరునాగారం మండలం రొయ్యూరుకు చెందిన పరిమెల్ల నీలాద్రి, వాజేడుకు చెందిన రాంబాబులు మండలంలోని కడేకల్ నుంచి చెరుకూరు వైపు వస్తుండగా ఎర్రబోరు వద్ద వీరి బైకు అదుపుతప్పి పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో నీలాద్రికి తీవ్రగాయాలు కాగా స్థానికులు వాజేడు వైద్యశాలకు తరలించి చికిత్సను అందించారు. రాంబాబుకు స్వల్పగాయాలు అయ్యాయి.

వరద బాధితులకు విరాళాల సేకరణ

ములుగు కలెక్టరేట్, సెప్టెంబరు 21: వరద బాధితుల సహాయార్థం ములుగు జిల్లా నిరుద్యోగ కళాకారుల సంఘం అధ్యక్షుడు మోతె రమేష్ ఆధ్వర్యంలో శనివారం జిల్లాకేంద్రంలో విరాళాలను సేకరించారు. సామాజిక గీతాలను ఆలపిస్తూ పలువురి నుంచి విరాళాలు అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కళాకారుల సంఘం అధ్యక్షుడు గోల్కొండ భిక్షపతి, కళాకారులు రాగుల శంకర్, యాకయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు నో బ్యాగ్ డే

వాజేడు, సెప్టెంబరు 21: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు శనివారం నో బ్యాగ్ డే కార్యక్రమంను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులన క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా భారత్ గ్యాస్ గుడౌన్ వద్దకు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా విద్యార్థులకు గ్యాస్ వినియోగంపై అవగాహన కల్పించారు. పాఠశాల హెచ్ఎం సోయం ఆనందరావు, ఉపాధ్యాయులు స్వరూప్ సింగ్, శ్రీకాంత్, రాజేష్, గ్యాస్ డీలరు అభిషేక్ పాల్గొన్నారు.

● ములుగు కలెక్టరేట్ : ములుగులోని బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం నో బ్యాగ్‌డే కార్యక్రమం ప్రధానోపాధ్యాయుడు క్యాతం రాజేందర్ ఆధ్వర్యంలో జరిగింది. ఇందులో భాగంగా విద్యార్థులు యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియాను సందర్శించి బ్యాంకులో జరుగుతున్న లావాదే వీలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. బ్యాంకు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వివిధ లావాదేవీలు, ఖాతాలు, అప్పుల వివరాలు, లాకర్ సౌకర్యాలు, తదితర అంశాలను డిప్యూటీ మేనేజర్ రంజిత్ వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పిట్టల మల్లయ్య, శిరుప సతీష్‌కుమార్, మహమ్మద్ జాఫర్‌అలీ, కేశబోయిన మదన్మోహన్ పాల్గొన్నారు.

నేడు ములుగుకు కేంద్రమంత్రి జార్జ్ కురియన్

ములుగు, సెప్టెంబరు 21: భారతీయ జనతాపార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా ఈనెల 22న ములుగుకు కేంద్ర మత్స్యకార, పాడిపరిశ్రమలు, మైనార్టీ వ్యవహారాలశాఖ మంత్రి జార్జ్ కురియన్ వస్తున్నట్లు ఆపార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి శీలమంతుల రవీంద్రాచారి ఒక ప్రకటనలో తెలిపారు. ఇంచర్లలోని ఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో సభ్యత్వ నమోదు కమిటీ సభ్యులు, పదాధికారులు, పార్టీ మండల అధ్యక్షులు, మోర్చా, సీనియర్ నాయకులతో సమావేశమవుతారని వెల్లడించారు.

నేడు మహదేవపూర్‌కు బండి సంజయ్‌రాక

మహదేవపూర్, సెప్టెంబరు 21: మహేదవపూర్ మండల నాయకులు మంథని రాజేందర్ కుటుంబాన్ని పరామర్శించేందుకు నేడు(ఆదివారం) కేంద్ర హోం సహాయక మంత్రి బండి సంజయ్ మహదేవపూర్ రానున్నారు. ఇటీవల బీజేపీ సభ్యత్వ నమోదు చేస్తూ గుండెపోటుతో రాజేందర్ మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో బొమ్మాపూర్ క్రాస్ నుండి రాజేందర్ ఇంటి వరకు నేడు ఉదయం 11.30 గంటలకు బండి సంజయ్ బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు బీజేపీ నాయకులు తెలిపారు.

సాంకేతిక సమస్యతో 'మీసేవ'లో జాప్యం

ములుగు కలెక్టరేట్, సెప్టెంబరు 21: స్టేట్ డేటా సెంటర్‌లో ఏర్పడ్డ సాంకేతిక సమస్యలతో పదిరోజులుగా మీసేవా కేంద్రాలలో పౌరసేవలకు కొంత జాప్యం జరిగిందని ఈడీఎం దేవేందర్ తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఉన్న మీసేవా కేంద్రాల నిర్వాహకులతో వీడియో కాన్ఫరెన్స్‌లో సూచనలు చేశారు. జూలై 10 నుంచి సెప్టెంబరు 12వరకు చేసుకున్న దరఖాస్తులు అప్రూవ్, రిజక్ట్ కాకుండా పెండింగ్‌లో ఉన్నట్లయితే వాటిని సంబంధిత అధికారుల లాగిన్ నుంచి తిరిగి మీసేవా లాగిన్‌కు పంపించినట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన సమాచారం దరఖాస్తుదారులకు మెస్సేజ్ రూపంలో పంపించడం జరిగిందని, అలాంటి వారు తిరిగి మీసేవా కేంద్రాలలో మరలా డాక్యుమెంట్లను సమర్పించాలని, ఇందు కోసం ఎటువంటి అదనపు రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని వెల్లడించారు. కాగా, మంగపేట మండలంలోని మీసేవా కేంద్రాలను పరిశీలించిన ఈడీఎం దేవేందర్ నిర్వాహకుల సందేహాలను నివృత్తి చేశారు. ఆయన వెంట డిస్ట్రిక్ట్ మేనేజర్‌లు విజయ్, రాకేష్ పాల్గొన్నారు.

పిల్లల ప్రగతిపై తల్లిదండ్రుల సూచనలు కావాలి

భూపాలపల్లిటౌన్, సెప్టెంబరు 21: పిల్లల ప్రగతిపై ఉపాధ్యాయులకు తల్లిదండ్రుల సూచనలు అవసరమని సెక్టోరియల్ అధికారులు రమేష్, లక్ష్మణ్ అన్నారు. శనివారం చెల్పూరు జడ్పీహెచ్ఎస్‌లో తల్లిదండ్రులు-ఉపాధ్యాయులు సమావేశం ప్రత్యేకంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు.ప్రధానోపాధ్యాయుడు అశోక్, అమ్మ కమిటీ అధ్యక్షులు విజయ, ఉపాధ్యాయులు జ్యోతి, దామోదర్, అశోక్, ఓదెలు పాల్గొన్నారు.

రెండు బైక్‌లు ఢీకొని వ్యక్తి మృతి

కాటారం, సెప్టెంబరు 21:మండలంలోని కాటారం-మేడారం ప్రధాన రహదారిపై పోతులవాయి చెరువు వద్ద గుర్తు తెలియని బైక్ మరో బైక్‌ను ఢీ కొన్న రోడ్డు ప్రమాదంలో ఇబ్రహీంపల్లి జీపీ పరిధిలోని పోతులవాయి గ్రామానికి చెందిన గువ్వల రవి(30)అనే వ్యక్తి దుర్మరణం చెందాడు. కాటారం ఎస్సై అభినవ్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ..పోతులవాయికి చెందిన గువ్వల రవికి భార్య సుమలత, రఘువరణ్, రక్షిత, రాహుల్ అనే ముగ్గురు పిల్లలున్నారు. వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం మండలకేంద్రంలో పని నిమిత్తం బైక్‌పై వెళ్లిన రవి తిరిగి ఇంటికి బయలుదేరాడు. పోతులవాయి చెరువు సమీపం నుంచి వెళ్తుండగా చింతకాని వైపు వెళ్తు న్న గుర్తు తెలియని బైక్ వేగంగా వెనకనుంచి ఢీ కొట్టడంతో రవి ఎగిరి రోడ్డుపై పడగా తల వెనక భాగం పగిలి అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. మృతుడి భార్య సుమలత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు సాగిస్తున్నట్లు ఎస్సై అభినవ్ తెలిపారు.

మేడిగడ్డ బ్యారేజీకి కొనసాగుతున్న వరద ప్రవాహం

మహదేవపూర్ రూరల్, సెప్టెంబరు 21 : కాళేశ్వరం ప్రాజెక్టులో ప్రధానమైన మేడిగడ్డ బ్యారేజీకి వరద ప్రవాహం కొనసాగుతోంది. శనివారం బ్యారేజీలోకి 90,340క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా 85గేట్లను ఎత్తి అంతే నీటిని దిగువకు పంపిస్తున్నారు. బ్యారేజీ వద్ద 2మీటర్ల ఎత్తులో ప్రవాహం కొనసాగుతోంది.

స్కిల్స్‌తో భవిష్యత్‌ను మార్చుకోవాలి

భూపాలపల్లిటౌన్, సెప్టెంబరు 21: సమాజంలో ప్రతీ ఒక్కరు స్కిల్స్ నేర్చుకుంటేనే వారి భవిష్యత్ మారుతుందని భూపాలపల్లి సీఐ నరేష్‌కుమార్ అన్నారు. శనివారం పట్టణంలో ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ భూపాలపల్లి ఏరియా ఇన్‌చార్జి పెద్ది పృథ్వి ఆధ్వర్యంలో రెండు రోజుల శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి. తొలిరోజు సీఐ నరేష్‌కుమార్ హా జరై కార్యక్ర మాన్ని ప్రారంభించారు. . ఈ శిక్షణా తరగతులు ఎంతో మం ది జీవితాలను మారుస్తుందని చెప్పారు. అనంతరం నిర్వాహకుడు పృథ్వీ మాట్లాడుతూ ఈ శిక్షణా తరగతులకు రావాలనుకునే వారు 93967 82088ను సంప్రదించాలని కోరారు.

కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి

కాటారం, సెప్టెంబరు21: బడుగు బలహీనవర్గాలకు స్ఫూర్తి ప్రధాతగా నిలిచిన మహనీయుడు కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. మండలకేంద్రంలోని అంబేద్కర్‌కూడలిలో పద్మశాలి సంఘం నాయకులు కొండా లక్ష్మణ్ 12వ వర్ధంతి కార్యక్రమం సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పేదలకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పద్మశాలీ సేవా సంఘం మండల అధ్యక్షుడు దోమల సమ్మయ్య, సంఘం నాయకులు పల్నాటి బలరాం, పులి అశోక్, అమృత సంతోష్, మాచర్ల రాజేందర్, వలస వెంకటేశ్వర్లు, కుసుమ సమ్మయ్య, కొండ వెంకటేశ్వర్లు, దాసరి గట్టయ్య, మాచర్ల రాజయ్య, దోమల రాజశేఖర్ ఉన్నారు.

ఇసుకదందాలో ఎమ్మెల్యే పేరు వాడొద్దు

మొగుళ్లపల్లి, సెప్టెంబరు 21: ఇసుక అక్రమ దందా చేసేవారు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పేరును వాడుకుని చెడ్డపేరు తేవొద్దని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కాంగ్రెస్‌పార్టీ జిల్లా నాయకుడు తక్కళ్లపల్లి రాజు అన్నారు. శనివారం మండలకేంద్రంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. మండలంలో ఇసుక మాఫియా ముఠాగా ఏర్పడిన కొందరు వ్యక్తులు అధికారులను, ప్రజలను తప్పుదోవ పట్టించడానికి ఎమ్మెల్యే పేరు వాడుకుంటున్నారని అన్నారు. అలాంటి వారిపై తగిన చర్యలు తీసుకుని ప్రకృతి వనరులను కాపాడుకోవాల్సిన బాధ్యత అధికారులు, ప్రజలపై ఉందని అన్నారు. రెవెన్యూ, పోలీస్ అధికారులు స్పందించి ఇసుక దందాను పూర్తిస్థాయిలో నిలిపివేయాలని ఆయన కోరారు.

నిరుపేద కుటుంబాలకు ఆర్థికసాయం

ఏటూరునాగారం, సెప్టెంబరు 21: గత రెండు రోజుల క్రితం మండల కేంద్రంలోని ఆకులవారిఘణపురం ప్రాంతానికి చెందిన కంకణాల గీతిక(6) విషజ్వరంతో మృతి చెందిన విషయం తెలిసిందే. కాగా, నిరుపేద కుటుంబానికి చెందిన గీతిక తల్లిదండ్రులకు స్థానిక బ్లడ్ డోనర్స్ అధ్యక్షులు సయ్యద్ వహీద్ ఆధ్వర్యంలో రూ. 20 వేలను దాతల సాయంతో సేకరించిన నగదును గీతిక తల్లిదండ్రులకు బ్లడ్ డోనర్స్ సభ్యులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్లడ్ డోనర్స్ ఉపాధ్యక్షుడు మెరుగు హరీష్, సభ్యులు మల్యాల పవన్, ఎమ్డీ. మున్నా, రాజేందర్ పాల్గొన్నారు.

గ్రీన్‌వుడ్‌లో మాక్ పోలింగ్

మహదేవపూర్, సెప్టెంబర్ 21 : మహదేవపూర్ మండల కేంద్రంలోని గ్రీన్‌వుడ్ కాన్సెప్ట్ స్కూల్‌లో శనివారం మాక్ పోలింగ్ నిర్వహించారు. స్కూల్ పీపుల్ లీడర్(ఎస్‌పీఎల్), (ఏఎస్‌పీఎల్) అసిస్టెంట్ పీపుల్ లీడర్ ఎన్నిక కొరకు మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ ఎన్నికల సందర్భంగా 700 మంది విద్యార్థులు ఎన్నికల్లో పాల్గొన్నారు. ఎస్‌పీఎల్ కోసం ఆరుగురు పోటీ చేయగా పదో తరగతి విద్యార్థి శివస్వరణ్ ఎన్నికయ్యాడు. ఏఎస్‌పీఎల్‌గా పి.అక్షయ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సీహెచ్.శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్ ఆకుతోట రాజ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ రవికుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

ట్రైబల్ వెల్ఫేర్ ప్రిన్సిపల్‌పై చర్యలు తీసుకోవాలి

ఏటూరునాగారం, సెప్టెంబరు 21: మండల కేంద్రంలోని ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల బాలుర పాఠశాల విద్యార్థులను పట్టించుకొని ప్రిన్సిపల్‌పై చర్యలు తీసుకోవాలని భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) జిల్లా కమిటీ సభ్యులు సోడి అశోక్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసి సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు వంశీ, మల్లికార్జున్, మహేష్, స్వామి పాల్గొన్నారు.

కేసుల పరిష్కారానికి సహకరించాలి



అధికారులతో మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి సూర్యచంద్రకళ

ములుగు కలెక్టరేట్, సెప్టెంబరు 21: జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాల్లో అత్యధిక కేసుల పరిష్కారానికి అధికారులు సహకరించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా న్యాయాధికారి ఎస్‌వీపీ. సూర్యచంద్రకళ అన్నారు. శనివారం కోర్టు ఆవరణలో పోలీసు, రెవెన్యూ, ఎక్సైజ్ అధికారులతో సమావేశమయ్యారు. ఈనెల 28న ము లుగులో జిల్లా కోర్టులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. న్యాయ సహాయం కోసం సేవాధికార సంస్థలను సంప్రదిం చాలన్నారు. సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి టీ.కన్నయ్యలాల్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి డిరామ్మోహన్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ దివాకర, ఎస్పీ శబరీశ్, ఆర్‌డీవో సత్యపాల్‌రెడ్డి, డీఎస్పీ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యకేంద్రాలను తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో

తాడ్వాయి, సెప్టెంబరు 21: మండలంలోని తాడ్వాయి, కాటాపూర్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలతోపాటు బీరెల్లి, నర్సాపూర్ వెల్‌నెస్ సెంటర్లను శనివారం డీఎంహెచ్‌వో డాక్టర్ అల్లెం అప్పయ్య తనిఖీ చేశారు. ఈసందర్భంగా ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో ఎన్ని ప్రసవాలు జరిగాయని మెడికల్ ఆఫీసర్ మౌనికను అడిగి తెలుసుకున్నారు. డాక్టర్లు మౌనిక, రంజిత్, స్నిగ్ధ, ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు, సూపర్‌వైజర్లు ఉన్నారు

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి

ములుగు, సెప్టెంబరు 21: శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజలు సహకారమందించాలని, నేరాలను నియంత్రించడంలో పోలీసుశాఖకు మద్దతుగా నిలబడాలని డీఎస్పీ రవీందర్ అన్నారు. ములుగు మండలం ఖాసిందేవిపేటలో శనివారం గ్రామసభ నిర్వహించారు. సమస్యలు ఎదురైతే ఎవ్వరిని సంప్రదించాలనే విషయమై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఐ శంకర్, ఎస్సై వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నీటి నిల్వలతోనే మానవ మనుగడ

గణపురం, సెప్టెంబరు 21: భూమిపై నీటి నిల్వలను పెంచితేనే మానవ మనుగడ ఉంటుందని శ్రీనారాయణ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ భానుచందర్ అన్నారు. శనివారం గణపురం మండలకేంద్రంలోని శ్రీనారాయణ ఉన్నత పాఠశాలలో నీటిని కాపాడండి- మన మాతృభూమిని రక్షించండి అనే అంశంపై బ్లూకలర్స్ డే కార్యక్రమాన్ని పాఠశాల యాజమాన్యం నిర్వహించింది. విద్యార్థులతో ఈ సందర్భంగా చిత్రపటాలు వేయించారు. సేవ్ ద వాటర్, సేవ్ ద ఎర్త్ అంటూ నినాదాలు చేశారు. డైరెక్టర్ రవి, ప్రిన్సిపల్ స్రవంతి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో గ్రోత్ మేళా

కాటారం, సెప్టెంబరు 21:మండలంలోని నస్తూరుపల్లి, రేగులగూడెం, గొల్లపల్లి, దేవరాంపల్లి తదితర అంగన్వాడీ కేంద్రాల్లో శనివారం గ్రోత్ మేళా నిర్వహించారు. పిల్లల ఎత్తులు, బరువులు ఏ వయస్సులో ఎంత ఉండాలి..వారి ప్రస్తుత స్థితిని తెలుసుకోవడానికి పిల్లల ను స్క్రీనింగ్ చేశారు. పిల్లలకు మంచి పౌష్టికాహారం, డబుల్ డోస్ టీహెచ్ఆర్ అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శివరాణి, వీణ అంగన్వాడీ టీచర్లకు సూచించారు. పీహె చ్ఎన్ అన్నపూర్ణదేవి, పద్మావతి పాల్గొన్నారు.

చైతన్య ఆటో యూనియన్ నూతన కమిటీ ఎన్నిక

మంగపేట, సెప్టెంబరు, 1: మండలంలోని రాజుపేటలో శ్రీచైతన్య ఆటో యూనియన్ నూతన కమిటిని శనివారం యూనియన్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు మహమ్మద్, నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లు ఎన్నుకున్నారు. రాజుపేట ఆటో యూనియన్ అధ్యక్షుడిగా కర్రి శ్రీను, ప్రధానకార్యదర్శిగా చిట్యాల సాంబశివరావు, కోశాధికారిగా దిగొండ నవీన్‌గా ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. రాజుపేట ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

ముమ్మరంగా పోలీసుల వాహన తనిఖీలు

కాటారం, సెప్టెంబరు 21: మండల పరిధిలోని 353(సీ)జాతీయ రహదారి, కాటారం-మంథని ప్రధాన రహదారిపై పలు చోట్ల శనివారం పోలీసులు విస్తృతంగా వాహనాల తనిఖీలు చేపట్టారు. మావోయిస్టు ఆవిర్భావ వారోత్సవాల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ గడ్డం రాంమోహన్ రెడ్డి, సీఐ నాగార్జునరావు ఆదేశాల మేరకు ఎస్సై మ్యాక అభినవ్ ఆధ్వర్యంలో టీఎస్ఎస్పీ బలగాలు, సివిల్ పోలీసులు వాహనాల తనిఖీ చేశారు.

కార్మికులతో చెలగాటమాడుతున్న యాజమాన్యం

- మావోయిస్టు పార్టీ కోల్‌బెల్ట్ కమిటీ కార్యదర్శి ప్రభాత్

కాకతీయఖని, సెప్టెంబరు 21: సింగరేణి కార్మికుల ప్రాణాలతో యాజమాన్యం చెలగాటమాడుతుందని మావోయిస్టు పార్టీ కోల్‌బెల్ట్ కమిటీ కార్యదర్శి ప్రభాత్ శనివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. అండర్‌గ్రౌండ్ గనుల్లో కార్మికులకు సరిపడ వెంటిలేషన్ అందక వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. పలు చోట్ల కార్మికుల ప్రాణాలు పోయిన సందర్భాలు ఉన్నాయని తెలిపారు. వారికి న్యాయం చేయాల్సిన కార్మిక సంఘాల నాయకులు, సింగరేణి అధికారులు కుమ్మక్కై జరిగిన ప్రమాదాలు కార్మికుల తప్పిదమేనని చెబుతూ వారికి తీరని అన్యాయం చేస్తున్నారని పేర్కొన్నారు. ఇటీవల గని ప్రమాదాలలో మరణించిన వారి కుటుంబాలకు పూర్తి బెనిఫిట్స్‌తో పాటు నష్ట పరిహారం అందించి వారి కుటుంబ సభ్యులలో ఒకరికి సూటబుల్ జాబ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. గోదావరిఖని, అడ్రియాల ప్రాజెక్ట్‌లో విద్యుత్ షాక్‌కు గురైన కార్మికులకు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు.

తల్లిదండ్రులకు పిల్లల పాదపూజ

మహదేవపూర్, సెప్టెంబరు 21 :మహదేవపూర్ మండల కేంద్రంలో జడ్పీహెచ్ఎస్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థులు వారి తల్లిదండ్రులకు పాదపూజ చేశారు. అనంతరం పూలతో పూజ చేసి ఆ నీళ్లను తలపై చల్లుకుని వారి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపా ధ్యాయులు బి.రాజిరెడ్డి, ఉపాధ్యాయులు ప్రభాకర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

ఓటర్ జాబితా అభ్యంతరాలపై పరిశీలన

కాటారం, సెప్టెంబరు 21:మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో జీపీ ఓటర్ ముసాయిదా జాబితాలపై అభ్యంతరాల స్రూటినీ కోసం శనివారం సమావేశం నిర్వహించారు. మండల ంలోని 24 గ్రామపంచాయతీలకు చెందిన కార్యదర్శులతో ఎంపీడీవో అడ్డూరి బాబు, ఎంపీవో వీరస్వామి సమావేశం నిర్వహించి డ్రాఫ్ట్ నోటిఫికేషన్ అభ్యంతరాలపై పరిశీలించారు. మండలవ్యాప్తంగా 24 అభ్యంతరాలు వచ్చినట్లు ఎంపీడీవో తెలిపారు. ఈ నెల 28న ఓటర్ జాబితా ఫైనల్ నోటిఫికేషన్ ఇవ్వనున్నట్లు అధికారులు వెల్లడించారు.